



# తెహల్కా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి వార్త సంచలనం





హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 93 | శనివారం ,9 మే, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి

# కోర్సులతో డిగ్రీ కళాశాలలు...



- మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు...
- మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

తెహల్కా, మే 08

హైదరాబాద్ మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు - మిగతా2లో

# గవర్నెన్స్‌లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ ముఖ్యం




తెహల్కా, మే 08

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి ముఖ్యమైన అంశమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎస్, సెక్రటరీలు, హెచ్‌వోడీలు మొదలుకొని.. మండల స్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్సులో వేగం పెంచాలని ఆదేశించారు. రు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ.. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు. - మిగతా2లో

# ప్రాణహిత పై ప్రధానికి వివరించండి

తెహల్కా, మే 08



ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. నీటి లభ్యతపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. నాటు పడవలపై నదీ ప్రవాహాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ - మిగతా2లో

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

తెహల్కా, మే 08



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, - మిగతా2లో

# యువత మత్తుకు దూరంగా ఉండాలి

తెహల్కా, మే 08



యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన – ప్రగతి - మిగతా2లో

# పోలీస్ అధికారి భార్య హత్య కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

తెహల్కా, మే 08




జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాల పై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు - మిగతా2లో

# కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

తెహల్కా, మే 08



రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా - మిగతా2లో

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

తెహల్కా, మే 08



రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత - మిగతా2లో

# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

తెహల్కా, మే 08



ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు. - మిగతా2లో

## బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమిం చాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు.

## పోలీస్ అధికారి భార్య హత్య

-మొదటిపేజీ తరువాయి

రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్ల పై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాల పై ఆరా తీస్తున్నామని తెలిపారు.

## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

-మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో కృష్ణానగర్ వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. కృష్ణానగర్ వరద సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కృష్ణానగర్‌లో కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేసింది హైడ్రా. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పనులను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వరద కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అధికారులు. నాలాల్లో డీసిల్టింగ్ పనుల్లో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యం వహిస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వచ్చే మట్టి కారణంగా సమస్య తీవ్రత పెరుగుతోందని అంటున్నారు అధికారులు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు చర్యలు చేపట్టామని అన్నారు. కృష్ణా నగర్ వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని..8 నుంచి 9 అడుగుల లోతున్న కాలువల్లో 6 నుంచి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని తెలిపారు అధికారులు. అవసరమైతే స్లాబులు తొలగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని స్పష్టం చేశారు కమిషనర్ రంగనాథ్. నాలాపై నిర్మించిన ఒకటి రెండు ఇళ్లను గుర్తించామని... తప్పనిసరి పరిస్థితి వస్తేనే తొలగింపు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇళ్ల ఖాళీ చేయించటానికి ముందు నోటీసులు, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు కమిషనర్ రంగనాథ్.

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు. ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు...

-మొదటిపేజీ తరువాయి

ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని,ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహజీబ్ ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలని సీఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు) మహ్మద్ షబ్బీర్ అలీ, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## గవర్నెన్స్‌లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

వాట్సాప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని సీఎం తెలిపారు. మాన్యువల్ ఫైళ్లనేవి దాదాపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఫైళ్లక్లియరెన్స్, అవేర్, డేటా లేక్ అంశాలపై సీఎం సమీక్షించారు. ఫైళ్లను త్వరగా క్లియర్ చేస్తే ప్రభుత్వ సేవలు మరింత త్వరగా అందుతాయని సీఎం అన్నారు. పాలనకు టెక్నాలజీ అనుసంధానించడంతోపాటు హ్యూమన్ టచ్ కూడా ముఖ్యమని వ్యాఖ్యానించారు. 24 గంటల్లోపు ఈ–ఫైల్స్ డిస్పోజ్ చేసేలా మంత్రులు, అధికారులు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరి పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నామని వెల్లడించారు. జిల్లాల్లో ఇ–ఆఫీస్ ద్వారా లేని ఫైల్స్ ఎన్ని ఉన్నాయో గుర్తించాలని సూచించారు. జిల్లా స్థాయిలో హెచ్‌ఓడీలు తప్పనిసరిగా ఈ–ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు సేవలందించే విషయంలో, మరింత మెరుగైన పాలనకు కలెక్టర్లు వినూత్నంగా ఆలోచించాలన్నారు. క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి రావడం పై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. క్లియరెన్స్‌లో వేగంగా ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, సెక్రటరీలను సీఎం అభినందించారు. పెద్దమొత్తంలో ఫైళ్ల వచ్చినా సరాసరి 10 గంటల వ్యవధిలో డిస్పోజ్ చేసిన సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎం అభినందనలు తెలిపారు. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత టైమ్ వృథా అవుతుందో ఆలోచించాలని అన్నారు. ఇప్పటికే 29 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చామని.. 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ నాటికి అన్ని సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని ఆదేశించారు. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. పిడుగుల హెచ్చరికలను జారీ చేయటంలో ఇంకా పర్ఫెక్షన్ రావాలన్నారు. తుఫాన్ల హెచ్చరికల సమయంలో నేరుగా మొబైళ్లకే మెసేజ్‌లు పంపించాలని తెలిపారు. తుఫాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ, వార్డుల ద్వారా కూడా పంపించాలని అన్నారు.

## ప్రాణహిత పై ప్రధానికి వివరించండి

-మొదటిపేజీ తరువాయి

ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, వికసిత్ భారత్ అని చెప్పుకునే కేంద్రం ఈ ప్రాజెక్టు విషయంలో పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒక్క యూనిట్ కరెంటు కూడా ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని తరలించే ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకుని సహకరించాలని మంత్రి జూపల్లి కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మూడు జిల్లాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని అన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎల్లుండి(మే 10) తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ పెద్దమనసుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సాగునీటి రంగంలో గ్రావిటీ ద్వారా నీటిని అందించే గొప్ప అవకాశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని ఆయన విమర్శించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ, 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. డా. బీఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. 106 కిలోమీటర్ల కాలువ పనులకు గానూ ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయ్యి, 46 కిలోమీటర్ల మేర పనులు కూడా జరిగాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఆర్థిక భారం మోపిందని మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా వెళ్లాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోయడం వల్ల అంచనా వ్యయం గణనీయంగా పెరిగిందని మంత్రి వివరించారు. దీనివల్ల రాష్ట్రంపై భారీగా ఆర్థిక భారం పడటమే కాకుండా, కరెంట్ బిల్లులు కూడా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నది తలాపునే ఉన్న సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ నీటిని వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉందని జూపల్లి తెలిపారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాం. దీనివల్ల మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు నష్టపోయిన వారికి పరిహారం ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు.

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

-మొదటిపేజీ తరువాయి

శాంతి భద్రతల క్షీణత పై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు.

# పంట మార్పిడితోనే రైతులకు అధిక నికరాదాయం





-రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమం

తెహెల్కా రంగారెడ్డి జిల్లా మేడ్చల్ ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచర్ల రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్,డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ పంటల మార్పిడి విధానం ద్వారా రైతులు అధిక నికరాదాయం పొందగలరని తెలిపారు.అలాగే భూసార పరిరక్షణతో పాటు వాతావరణ కాలుష్య నివారణకు కూడా పంట మార్పిడి దోహదపడుతుందని వివరించారు. వరి పంటలో తెలంగాణ సోనా (కేఎన్ఎమ్-1638),డబ్ల్యూజీఎల్-962 వంటి అధిక దిగుబడులు ఇచ్చే,చీడపీడలను తట్టుకునే సన్నగింజ రకాలను సాగు చేయాలని సూచించారు.నేరుగా వెదజల్లే విధానం, ఆరుతడి పద్ధతిలో సాగు వంటి ఆధునిక యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని కోరారు.సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని,భావితరాలకు నీటి కొరత రాకుండా ఇంకుడు గుంతలు,ఫాం పాండ్లు నిర్మించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివారెడ్డి,ఉపసర్పంచ్ సురేష్, పిఏసిఎస్ డైరెక్టర్ నాగుల సత్యనారాయణ,మండల వ్యవసాయ అధికారి నాగమణి,ఏఈఓ ఉదయ్ సింగ్,అభ్యుదయ రైతులు,రైతు సోదరీమణులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లుని చెల్లించి,బోరుబావిని పురుద్ధరించాలి

-సుమారు 300 కుటుంబాలకు మంచినీరు అందించాలని వాటర్ వర్క్స్ అధికారికి విజ్ఞప్తి

-ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

ఎల్బీనగర్, మే 08,తేహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వాటర్ వర్క్స్ మరియు సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చంపాపేట్ డివిజన్ (కర్మన్‌ఘాట్) పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ చేయాలని కోరారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో అధిక సంఖ్యలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. తీవ్ర తాగునీటి సమస్య కారణంగా ప్రజలు బోర్‌వెల్‌లపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బోర్‌వెల్‌కు సంబంధించిన విద్యుత్ బిల్లులను జీహెచ్ఎంసీ చెల్లించగా,అనంతరం వాటర్ వర్క్స్ వారు తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రూ.6,38,641/- బకాయిని కాలనీవాసులే చెల్లించాలని విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే పునరుద్ధరించి బకాయి బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం వచ్చే బిల్లులను అసోసియేషన్ వారే కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా బి.యన్.రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ పరిసరాల్లో ట్రంక్ లైన్ పనుల అంశాన్ని కూడా ఎం.డి. దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు సరైన అవుట్‌లెట్ లేక గుర్రంగూడ ఫారెస్ట్ మరియు హరిహరపురం కాలనీలోకి చేరుతూ ఫారెస్ట్ ప్రాంతంలోని రెండు చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన ట్రంక్ లైన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం సరూర్‌నగర్ చెరువు పరిధిలో 2.5 ఎం.ఎల్.డి సామర్థ్యం మాత్రమే ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దానిని 9 లేదా 10 ఎం.ఎల్.డి వరకు పెంచాలని సుధీర్ రెడ్డి కోరారు. దీనివల్ల చెరువులో కలుషిత నీరు తగ్గడంతో పాటు దుర్వాసన సమస్య తగ్గి, నీటి నాణ్యత మెరుగుపడి పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.అలాగే నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కారం చేయాలనీ కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎండి మాట్లాడుతూ తప్పకుండా సుధీర్ రెడ్డి చెప్పిన అంశాలను పరిగణనలో తీసుకొని సంబంధించిన అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి,చంపాపేట్ డివిజన్ యువ నాయకులు గండికోట శ్రీనాథ్ పలువురు కాలనీవాసులు ఆనంద్,దివాకర్,సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# విశ్రాంత డీజీ సతీమణి తనూజ హత్య కేసు..

-సంచలన విషయాలు వెల్లడించిన సీపీ సజ్జనార్

తెహెల్కా హైదరాబాద్:



జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. విశ్రాంత డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. విశ్రాంత డీజీ భార్య తనూజను నిన్న (గురువారం) రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనిమనిషి కల్పన ఈ హత్య చేసింది..నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. నిన్న (గురువారం) రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. వాళ్లపై నిఘా ఉంచాలి.. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం తనూజ హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి వృతురాలు తనూజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని సీపీ సజ్జనార్ తెలిపారు.

# ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం

-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తెహెల్కా హైదరాబాద్ :



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం తెహల్కా ఆయన మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు.

## కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కిరణ్ జ్యోతి రెడ్డిలను సన్మానించిన ము న్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవా ణి రవికుమార్.






యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

కుంభం ఫౌండేషన్ కుంభం కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో 'న్యూ డైమెన్షన్ హై స్కూల్ ప్రాంగణంలో 1బీ1దీ వన్ మిలియన్ వన్ బిలియన్ సంస్థ ఆధ్వర్యంలో భారీ మెగా జాబ్ మే ళా కార్యక్రమంలో భాగంగా భువ నగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,కిరణ్ జ్యోతి రెడ్డిల ను సన్మానించిన భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్. ఈ కార్యక్రమంలో అధికారులు,నా యకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుప్రా ఖుర్దు గ్రామ కరెంటు సమస్యకు పరిష్కారం.. ఏఈ చక్రపాణికి సర్పంచ్ రాజు గొల్లూరి కృతజ్ఞతలు

తెహెల్కా రంగారెడ్డి జిల్లా మేడ్చల్ ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:



మహేశ్వరం ఏఈ చక్రపాణికి తుప్రా ఖుర్దు గ్రామ సర్పంచ్ రాజు గొల్లూరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో నెలకొన్న కరెంటు కొరత సమస్యను పరిష్కరించేందుకు అడిగిన వెంటనే సెపరేట్ ఫీడర్‌ను మంజూరు చేసి గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించినందుకు గ్రామ పంచా యతీ పాలకవర్గం తరపున అభినందనలు తెలియజేశారు. గ్రామంలోని ఒక పెద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఏఈ చక్రపాణి సేవలను ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం హర్షం వ్యక్తం చేస్తూ కొనియాడింది.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పెంజర్ల యాదయ్య



తెహెల్కా రంగారెడ్డి జిల్లా మేడ్చల్ ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో మహేశ్వరం మండల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ,ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీ నుంచి, ఉప్పరబోయిన రామ్మూర్తి బహిష్కరణ.

మే 08,తెహల్కా



సీపీఐఎంఎల్ఊన్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీ భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్ ఉప్పర బోయిన రామ్మూర్తిని బహిష్కరించినట్లు తెలియజేశారు. సీపీఐఎం ఎల్ఊన్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీలో గత కొంత కాలం నుంచి జిల్లా కమిటీ సభ్యుడుగా,ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నా ఉప్పరబోయిన రామ్మూర్తి గత రెండు మూడు నెలల నుంచి పార్టీ విచ్ఛినకర చర్యలకు, ముఠా పద్ధతులకు ఆర్థిక అరాచకత్వానికి నైతికంగా పతనమై విప్లవ బలహీనతలను ప్రదర్శిస్తున్నాడు. కామ్రేడ్ మలుగూరి సుగుణక్క ఇప్పటికీ మా నిర్మాణంలో కొనసాగుతుంది.తనను కూడా చెడగొట్టి తన వెంట తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. విప్లవ ప్రతిగాతకుడిగా తయారై పార్టీలో ఉంటూ,పార్టీ రహస్యాలను ఇతర పార్టీలకు చేరవేస్తూ, కోవర్టుగా తయారైయి పార్టీలో ఉంటూ,నాయకత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తూ అన్యవర్గ దోరణులను అవలంబిస్తూ పార్టీని బలహీనపరుచుటకు తీవ్రమైన కుట్రలు కుయుక్తులకు పూనుకుంటున్నాడు. ఎన్నిసార్లు నిర్మాణ పరంగా మందలించిన తన ప్రవర్తన లో ఎలాంటి మార్పు కనబడలేదు.నిర్మాణపరంగా వ్యక్తిగతంగా అనేక రకాలుగా తన పద్ధతులు మార్చుకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని చెప్పినప్పటికీని,తన పరివర్తనలో ఎలాంటీ మార్పు కనిపించలేదు,నిర్మాణ పరంగా ఆర్థికంగా అన్ని రకాలుగా పతనమైన తనను పార్టీ జిల్లా కమిటీ నుంచి,ప్రజా సంఘాలు, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి,వైదొలగిస్తూ బహిష్కరిస్తున్నాం. ఇకనుంచి ఉప్పరబోయిన రామ్మూర్తికి, సీపీఐఎంఎల్ఊన్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాం.

# జిల్లా కలెక్టర్ కి మల్లూరు నృసింహస్వామి వారి ఆశీర్వచనం



మే 08,తెహల్కా

ములుగు జిల్లాలోని అత్యంత పురాతనమైన పుణ్యక్షేత్రం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా నూతన కలెక్టర్ హేమంత్ బోర్ఖాడేని దేవస్థాన అధికారులు మరియు అర్చకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి యం. వీరస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం కలెక్టర్ ని కలిసి స్వామివారి దివ్య ఆశీస్సులు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి సమర్పించిన పవిత్ర ముత్యాల తలంబ్రాలను, పట్టువస్త్రాలను మరియు ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు కలెక్టర్ కి మంత్రోచ్చారణలతో వేదాశీర్వచనం చేశారు. బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా పూర్తి కావడంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి ఈ సందర్భంగా ఆలయ వర్గాలు ధన్యవాదాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మే 08,తెహల్కా

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఖలిక్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంటెక్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ తరపున పశువులకు చికిత్స, పశువైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు సంతాన ఉత్పత్తి కొరకు చికిత్సలు చేయించాలని రైతులకు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార కోసం గడ్డి విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు వేసవికాలంలో పశువుల సంరక్షణ గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గుల గంగాధర్, ఇంచార్జ్ ఎంపీడీవో అశోక్ కుమార్, ఎంపీవో చంద్ర శేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు

# భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,కుంభం ఫౌండేషన్ చైర్పర్సన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయి లో మెగాజాబ్ మేళా









యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రముఖ 1వీ1దీ సంస్థసహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు3500 ఉద్యోగ అ వకాశాలను అందించ నున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కుప్పం, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతాల్లోవిజయవంతంగా ఉద్యో గ అవకాశాలు కల్పించిన 1వీ1దీ సంస్థ,ఇప్పుడు తెలంగాణ యువ త కోసం రాష్ట్రంలో మొట్టమొదటి సారి యాదాద్రి భువనగిరిని వేదిక గా ఎంచుకోవడం విశేషంగా నిలి చింది. ఇంటర్మీడియట్,డిగ్రీ,బీటెక్,ఐటీఐ డిప్లొమా ఇతర అర్హతలు కలిగిన యువతకు ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశా లు లభించనున్నాయి. ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపె నీలు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థుల ను ఎంపిక చేయనున్నాయి. జాబ్ మేళా మొదటి రెండు రోజు లు మే 8,9 తేదీ లలో అభ్యర్థుల స్క్రీనింగ్,సర్టిఫికెట్ల పరిశీలన మ రియు టోకెన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించబడుతుంది. అనంతరంమే10వ తేదీన ప్రధాన ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్య ర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. అలాగే ఇంటర్వ్యూలకు హాజర య్యే యువతకు ప్రత్యేకంగా గైడె న్స్,కమ్యూనికేషన్ స్కిల్స్ మరి యు ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై అవ గాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. యువతఉద్యోగఅవకాశా ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరి స్థితుల్లో, ప్రముఖ కంపెనీలే జిల్లా కేంద్రానికి వచ్చ అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులను, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచాల మండలంఆరుట్లగ్రామం లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వవిప్, ఆలేరుఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదాద్రి భువనగిరి.తేహెల్క న్యూస్:




ఆలేరు నియోజకవర్గం లోని మో టకొండూరు మండ లకేంద్రంలో ఈ మధ్య మంజూరైనటువంటి తెలం గాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం అక్క డేజరిగే కార్యకలాపాలు ఎలా ఉం డబోతోందో పూర్తి స్థాయిలో పైలెట్ పాఠశాలలో పర్యవేక్షించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో ఆధు నిక వసతులతో ఆంగ్ల మాధ్యమం లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకువిద్యను అందిస్తున్న విధా నాన్ని పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్న ఈ పాఠశాల లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు,క్రీడా మైదానం,కంప్యూటర్ ల్యాబ్,లైబ్రరీ,కార్పొరేట్ పాఠశాలతరహా బోధ న విధానం,ప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట వస్తువులు, ఆధునిక ఫర్నిచర్ వంటి సౌకర్యాల ను ఆయన కలియ తిరిగి పరిశీ లించారు.విద్యార్థులకు నాణ్యమై న విద్యతో పాటు సకలసౌకర్యా లు కల్పిస్తూ పాఠశాలను అభివృ ద్ధి చేస్తున్నరని ర్వాహకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందిం చారు. ఈ సందర్భంగా బీర్ల అ యిలయ్య మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అం దుబాటులోకి రావడం అభినంద నీయమన్నారు. ఇలాంటి గొప్ప పాఠశాలనుఆలేరు నియోజకవర్గం లోని మోటకొండూ రు మండలానికి ఇవ్వడం,చాలా సంతోషకరమని ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యే క ధన్య వాదాలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆ ధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూ డిన విద్యా విధానం ఎంతో అవస ర మనిపేర్కొన్నారు. ప్రభుత్వ,ప్రైవేట్ అనేతేడా లేకుం డా ప్రతివిద్యార్థి కినాణ్యమైనవిద్య అందాలని,అలాంటి లక్ష్యంతో తె లంగాణ పబ్లిక్ స్కూల్ పని చేయ డం సంతోషకరమని అన్నారు.

# సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరగ బోయే భారీ బహిరంగ సభను విజ యవంతం చెయ్యండి. బిజెపి బైక్ ర్యాలీ





యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

భారతీయజనతా పార్టీ పట్టణశాఖ అధ్యక్షులు రత్నాపురం బలరాంఆ ధ్వర్యంలో 10 /05/2026 రోజున సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరగ బోయే నరేంద్ర మోడీ భారీబహిరం గ సభను విజయవంతం చేయాల ని కోరుతూ సావర్కర్ చౌరస్తా నుం డి భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జైనప ల్లి శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడు తూ... ఎన్డీయే ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి తెలంగాణ రాష్ట్రనికి వస్తున్న సందర్భంగా భారీ బహిరం గ సభ ఏర్పాటు చేయడం ఇట్టి సభను విజయవంత చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాశం భాస్కర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయా దశరథ,సుర్వి శ్రీనివాస్, కౌన్సిలర్ బండారి స్వర్ణలత,పట్ట ణ ప్రధాన కార్యదర్శిలు ఉదుత భాస్కర్,బొర్ర రాకేష్,యువర్ మో ర్చా జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నపురం శ్రీశైలం,పట్ట ణ ఉపాధ్యక్షులు కొల్లోజు సతీష్, ఎదగని సంతోష్,యాట వెంకటేష్ కారుపాటి రాజు,యువమోర్చా అ ధ్యక్షులు కానుకుంట్ల రమేష్,ఎం జాల రాంప్రసాద్,ఎంజలా మల్లిక, తడూరి రాజు,పవన్,భరత్ తదిత రులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం

యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:





పట్టణంలో అంతర్జాతీయ రెడ్ క్రా స్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రె డ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యు నాంట్ చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం జాతీయ పతాకంతో పాటు రెడ్ క్రాస్ జెండా ను ఎగరవేసారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ... రెడ్ క్రాస్ సంస్థ మానవత్వానికి ప్రతీక అని1863లో హెన్రీ ద్యునాం ట్ చే స్థాపించబడిన ఈసంస్థ యు ద్ధాలు,ప్రకృతి వైపరీత్యాలు,అం టువ్యాధుల సమయంలో కుల, మత,ప్రాంతాలకు అతీతంగా బా ధితులకు సేవలందిస్తోందని తెలి పారు.

మానవత్వం,నిష్పాక్షికత, తటస్థత,స్వాతంత్ర్యం,స్వచ్ఛంద సేవ,ఐక్యత,సార్వత్రికత' అనే 7 ప్రాథమిక సూత్రాలతో రెడ్ క్రాస్ వాలంటీర్లు చేస్తున్న సేవలు అభి నందనీయం అని కొనియాడారు. కోవిడ్ సమయంలో,అలాగే వరద లు వచ్చినప్పుడు రెడ్ క్రాస్ వాలం టీర్లు ముందుండి సేవలు అందిం చారన్నారు.రక్తదానశిబిరాలు,ఉచి త వైద్య శిబిరాలు,ప్రథమ చికిత్స శిక్షణ,విద్యార్థులకు యువతకు ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహ న కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజానికిఎంతో మేలుచేస్తున్నా రని తెలిపారు. యువత రెడ్ క్రాస్ స్ఫూర్తిని అలవర్చుకొని స్వచ్ఛంద సేవలో పాల్గొనాలని అలాగే.ప్రతి ఒక్కరూ 'సేవే మార్గం' అని భావిం చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి"అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి,డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ప్రస్తుతం మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కావున సేవా దృక్పథం కలవారు రెడ్ క్రాస్ లో మెంబర్ షిప్ తీసుకో వాలని

# మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి

-రామచందర్‌రావు

తెహల్కా, హైదరాబాద్:

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు వ్యాఖ్యానించారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను ఇవాళ (శుక్రవారం) రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో ఆయన మాట్లాడారు.



తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం.

ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# మూసీ నివాసితులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా

-ప్రజా భవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ

-మూసీ నది పునర్జీవనానికి సహకరించండి

తెహల్కా, హైదరాబాద్:

మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మూసీ పునర్జీవన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ్ (బి-బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి-బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకు చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటి సీఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జి.వి. శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్ రాయ్, రేణుధల్, నబీ సాహెబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.



# మే 25, 26 తేదీలలో తెలంగాణ ప్రజా నాట్య మండలి 4వ రాష్ట్ర మహాసభలు





-గోడ పత్రిక ను ఆవిష్కరించిన సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ

తెహల్కా, హైదరాబాద్:

ఈ నెల 25, 26 తేదీలలో తెలంగాణ ప్రజా నాట్య మండలి 4వ రాష్ట్ర మహాసభలు హైదరాబాద్ నగరంలో జరుగుతాయని తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ వెల్లడించారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ. నరసింహ తెలంగాణ ప్రజా నాట్య మండలి 4వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు స్వాతంత్ర పోరాటంలో రచయితలు, కవులు, కళాకారులూ ప్రజలను చైతన్య పరచడానికి దేశంలో ఇండియన్ ప్యూపిల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) దానికి అనుబంధంగా రాష్ట్రంలో తెలంగాణ ప్రజా నాట్య మండలి స్థాపించారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రజా నాట్య మండలి కళాకారులూ తమ ఆట పాటలతో ప్రజలను చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేసారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో అల్లు రామలింగయ్య, నాగభూషణం, మాదాల రంగ రావు, టి. కృష్ణ, వందేమాతరం శ్రీనివాస్ రావు వంటి మహా నటులు, దర్శకులు, సంగీత దర్శకులను ప్రజా నాట్య మండలి సినిమా రంగానికి అందించిందని తెలిపారు. 83 సంవత్సరాల నుండి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఘన చరిత్ర కలిగిన తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారథిగా తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలు మే 25, 26 తేదీలలో హైదరాబాద్, నారాయణ గూడా, మర్వెల్ ఫంక్షన్ హాల్లో రెండు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మే 25 న ఉదయం 10 గంటలకు హైదరాబాద్, హిమాయత్ నగర్ , ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుండి వేలాదిమంది కళాకారులతో భారీ ప్రదర్శన, అనంతరం మర్వెల్ ఫంక్షన్ హాల్లో బహిరంగ సభ జరుగుతుందని, ఈ బహిరంగ సభలో ఎంఎల్సీ ప్రో. కోదండరాం, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న తదితరులు పాల్గొంటారని, సభ అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమౌతుందని ఈ.టి. నరసింహ వెల్లడించారు. పల్లె నరసింహ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కళ కళ కోసం కాదు, కళ ప్రజలకోసం అని ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో తన కలాన్ని, గళాన్ని అంకితమిస్తూ తెలంగాణ ప్రజానాట్యమండలి ఉద్యమిస్తుందని అన్నారు. హైదరాబాద్ లో జరిగే ఈ మహాసభలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి దాదాపు 500 కవులు, కళాకారులూ ప్రతినిధులుగా పాల్గొంటారని తెలిపారు. కళాకారులూ ఎదురుకుంటున్న సమస్యలపై ఈ మహాసభలలో చేర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, కె. లక్ష్మి నారాయణ, సహాయ కార్యదర్శి కొండల్ రావు, కోశాధికారి పడాల నళిని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు కంపల్లి శ్రీనివాస్, సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ ప్రచారం సేవా గుణమే తమ లక్ష్యం : పి శ్రీనివాసాచార్యులు

-శ్రీ లక్ష్మీ చెన్నకేశవ హిందూ ధర్మప్రచార సేవ చారిటబుల్ ట్రస్ట్ ను ప్రారంభించిన కే. చంద్రమోహన్

శిరివెళ్ల తెహల్కా న్యూస్ :

(కోటపాడు) :- మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్ట్ కేంద్రాన్ని కే. చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేదమంత్రాల మధ్య రిబ్బన్ కట్ చేసి సేవా చారిటబుల్ ట్రస్ట్ ను ప్రారంభించారు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలోని గిరిపురం కాలనీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసాచార్యులు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులుగా హాజరై శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్ట్ యొక్క విధివిధానాలను, హిందూ ధర్మ పరిరక్షణ కార్యక్రమాలను, సేవా భావాలను తమ చారిటబుల్ ట్రస్ట్ యొక్క విధి విధానాలను విలేకరుల సమావేశంలో వివరించారు. అయన మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం విస్తరించి, పూర్వపు ఆచార సాంప్రదాయాలను పక్కనపెట్టి ఆధ్యాత్మిక మరియు కుటుంబ సాంప్రదాయ విలువలు రోజురోజుకు సన్నగిల్లుతున్నాయని శ్రీనివాసచార్యులు తెలియజేశారు. విలువలు, విశ్వసనీయత, హిందుధర్మ పరిరక్షణ ప్రచారసదుద్దేశం అని, కుటుంబ సాంప్రదాయం సన్నగిల్లుతున్న తరుణంలో సమాజంలో సేవా గుణం అంకితభావం దేశభక్తి ఐక్యమత్యం సమాజంలోని పౌరులకు పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నేడు సమాజంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఈ నేపథ్యంలో కులాలు వేరైనా మనమంతా హిందువుల మని ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవా ట్రస్ట్ వృద్ధులు, అభాగ్యులకు సేవలు అందిస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని పి. శ్రీనివాస చార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ పి. ప్రభావతమ్మ, కోశాధికారి పి. సౌజన్య, ఉపాధ్యక్షులు కే.కృష్ణ ఆంజనేయులు, నంద్యాల జిల్లా అధ్యక్షులు పి మదన గోపాల్, నంద్యాల జిల్లా కార్యదర్శి బి.నర్సయ్య, గౌరవ అతిథి యస్ .మీనా, అనంతపురం జిల్లా అధ్యక్షులు గూగూడు గోపాల్ తదితర కమిటీ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.





# బంగారం ధరలు


manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
GOLD & SILVER RATES

| | | | |
|---|---|---|---|
| 24 kt | ₹ | 1,52,680 | 10gms |
| 22 kt | ₹ | 1,39,950 | 10gms |
| SILVER | ₹ | 2,75,000 | 1kg |

Contact: 6309 111299 | 99120 10888


## మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో పలు వివాహ వేడుకలకు హాజరు....ఎమ్మెల్యే బిఎల్ఆర్

-మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధ - బాలకృష్ణ

-వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష - నవీన్



మే 08,తెహల్కా

మిర్యాలగూడ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుధా బాలు, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, లు హాజరై నూతన వధూవరులను అక్షతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన జంటలు తమ వైవాహిక జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి విచ్చేసిన కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులతో కాసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ 2025-26 లోన్ లకి ఇంటర్వ్యూలు నిర్వహణ



మే 08,తెహల్కా

ఎస్సీ కార్పొరేషన్ లోన్ 2025-26 నాకు సంబంధించి మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి 167మంది లబ్ధిదారులు ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. వీరికి శుక్రవారం రోజు మండల పరిషత్ కార్యాలయం నందు మండల మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. వంశీధర్ అధ్యక్షతన మండల స్థాయి కమిటీ బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగినది.167మందికి గాను 135మంది హాజరు అయినారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్వో సరోజ పావని, ఎంపీ ఓ టి.సంగీత మరియు వివిధ బ్యాంక్ మేనేజర్లు పాల్గొనడం జరిగింది.

## అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేసిన దాసరి సాంబశివరావు

మే 08,తెహల్కా

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న నునావత్ రాము అనే పేషెంట్‌కు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో సామాజిక సేవకుడు దాసరి సాంబశివరావు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. పాల్వంచ సమీపంలోని పాలకోయి తండాకు చెందిన నునావత్ రాము ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు రక్తం కోసం ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దాసరి సాంబశివరావు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పేషెంట్ కుటుంబ సభ్యులు దాసరి సాంబశివరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ఆయన కోరారు.



## వేసవి శిబిరానికి విద్యార్థులకు ఆహ్వానం

-ఆదర్శ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్..



మే 08,తెహల్కా

వీణవంక మండలం లోని ఆదర్శ పాఠశాల ఘున్ముక్ల లో 11 మే నుండి 25 మే వరకు వేసవి శిబిరం నిర్వహించబడునని, ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్ మాట్లాడుతూ.. మండలం లోని అన్నీ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని,ఉదయం 8 నుండి 12 గంటల వరకు క్లాసెస్ జరుగునని,విద్యార్థుల పాఠశాలకి మరియు ఇంటికి రవాణా బాధ్యత తల్లిదండ్రులేవహించాలని,విద్యార్థులు తల్లిదండ్రుల సమ్మతి పత్రాన్ని తీసుకురావాలి.వేసవి శిబిరంలో పాల్గొనడానికి 100 మంది విద్యార్థులకు మాత్రమే అనుమతిఉంది.కార్యక్రమాలు:ఆటలు, సంగీతం , పాటలు, క్విజ్, భావప్రసార నైపుణ్యాలు, గణిత నైపుణ్యాలు, విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు, వ్యక్తిత్వ వికాసం , అవసరాల ఆధారిత కార్యక్రమాలు మొదలైనవి.విద్యార్థులు తమ పేరు, పాఠశాల పేరు మరియు విద్యార్థి పెన్ నంబర్‌తో నమోదు చేసుకోవచ్చు. పేరు నమోదు కోసం సెల్ నెంబర్ 9908020318 లో సంప్రదించాలన్నారు.

## నిరుపేద సొంతింటి కల నెరవేరింది

--మల్లుపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

--ప్రజా పాలన సంక్షేమ వారోత్సవాల్లో సందడి



మే 08,తెహల్కా

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. దీనిలో భాగంగా ప్రజాపాలన సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మెట్టు బాలమణి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో దామోదర్ సర్పంచ్ ఇమ్మడి నరేష్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. సొంతింటి కల నెరవేయడంతో లబ్ధిదారులు అధికారులకు మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్మడి నరేష్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్-రెవెన్యూ సరిహద్దులు పారదర్శకంగా నిర్వహించాలి :

-ఆర్డీవో జయచంద్ర రెడ్డి



మే 08,తెహల్కా

వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని మంగళ్‌పర్తి, హస్తాల్పూర్ గ్రామ శివార్లలో ఉన్న సర్వే నంబర్లు 401, 283లకు సంబంధించిన ఫారెస్ట్-రెవెన్యూ సరిహద్దుల వివాదంపై చర్చించారు. సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి తాసిల్దార్ శ్రీనివాస్ ఆర్ ఐ నర్సింగ్ యాదవ్ మరియు ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు

# రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం







-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

తెహల్కా పెద్దపల్లి:

అకాల వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో రైతులు మృతి చెందిన ప్రాంతాలను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, లక్షెట్‌పేట్ తహసిల్దార్ దిలీప్ కుమార్, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డి అధికారులతో కలిసి ఘటనాస్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. లక్షెట్‌పేట్ మండలం కొత్తూరు కొనుగోలు కేంద్రంలో గోడ కూలి రైతులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. రవాణా సమస్యల వల్ల రైతులు ఇబ్బంది పడకూడదని, లారీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కొత్తూరు కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ధాన్యాన్ని నెల్కి వెంకటాపూర్ గోదాముకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాల వర్షాల ప్రమాదంలో మృతి చెందిన కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబాన్ని, గంపలపల్లి గ్రామానికి చెందిన తండ్రి--కొడుకులు తనుగుల నాగరాజు, అభిరామ్ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్న కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ తహసిల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి

-కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 08,తెహల్కా





రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రం, ఎగ్లాస్ పూర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నాగారం, కనగర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కొలనూర్ గ్రామంలోని మారుతి రైస్ మిల్లును, కనగర్తి గ్రామంలోని సరస్వతి, కనకదుర్గ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను అధికారులు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వాహనాల ద్వారా తరలించిన ధాన్యం బస్తాలను వేగంగా దింపుకొని, తిరిగి వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని రైస్ మిల్లర్ల యజమానులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం అన్ లోడ్ చేయడంలో జాప్యం జరుగుతుందని, దీని వల్ల కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు ఎక్కువ సంఖ్యలో నిల్వ ఉంటున్నాయని అన్నారు. హమాలీల సంఖ్యను పెంచుకుని అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తనిఖీలో కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# పశువులు ఆరోగ్యంగా ఉంటేనే ఫెర్టిలిటీకి ఉపకరిస్తాయి

-వీణవంక పశువైద్యాధికారి శ్రీకాంత్..

మే 08,తెహల్కా



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో భాగంగా, నరసింహులపల్లి గ్రామంలో పశు గర్భ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ పశు వైద్య శిబిరంలో పశువులకు ఉచిత గర్భ నిర్ధారణ పరీక్షలు, పశువులు లో ఏద రావడానికి రైతులు పాటించాల్సిననియమాలను, సలహాలను పశు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పశువులు సంతాన ఉత్పత్తి జరగడానికి, పశువులను ఎల్లప్పుడు ఆరోగ్యంగా చూసుకోవాలని, అలాగే వాటి కావలసిన దాన, గడ్డి, క్యాల్షియం, ఇతరత్రా టానిక్లను ఎప్పటికప్పుడు అందిస్తూ, పశువులను వ్యాధులు సోకకుండా కంటికి రెప్పలాగా చూసుకోవాలని, ప్రభుత్వ నియమాలు పాటిస్తూ, పశువులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని, పశువులలో ఎద లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే గమనించి, దగ్గర్లో ఉన్న ఆసుపత్రి, లేదా గోపాలమిత్రతో కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. పాడి పశువులతో రైతుల ఇంట్ల సిరులు కురుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్,పశువైద్యాధికారులు శ్రీకాంత్, అభిలాష్, వెటర్నరీ సిబ్బంది, గోపాల మిత్రలు, పశు పోషకులు తదితరులు పాల్గొన్నారు.

# వీణవంక శివాలయంలో క్షీరాభిషేకం చేసిన హనుమాన్ స్వాములు

-ఆధ్యాత్మిక చింతనతో మొదలైన దైవదర్శనాలు..

మే 08,తెహల్కా

వీణవంక మండల కేంద్రంలోని పురాతన శైవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ శివాలయంలో శుక్రవారం ఉదయం బీరన్న కుటిరానికి చెందిన హనుమాన్ స్వాములు భక్తిశ్రద్ధలతో, ఆదిదేవుడైన పార్వతీ సమేత పరమేశ్వరునికి, ఉదయత్ పూర్వం బ్రాహ్మణ సన్నిధానంలో వేదమంత్రోత్ర నడుమ, స్వచ్ఛమైన గోవు పాలతో అభిషేక కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. అనంతరం హనుమాన్ స్వాములు మాట్లాడుతూ.. హనుమాన్ మాల ధరించిన నాటి నుండి మాల దీక్ష విరమణ చేసేవరకు ఆధ్యాత్మిక భావనతో ప్రతి దేవాలయంలో దర్శనం తో పాటు, అభిషేకాలు చేయడం, స్వామివారికి అభిషేకాలు అర్చనలు చేయడం జరుగుతుందని, గ్రామంలోని వైష్ణవ దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో శ్రవణా నక్షత్ర యుక్త శనివారం అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు జరుపనున్నామని, నిత్యం హనుమాన్ ఆలయంలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దైవ దర్శనాలలో భాగంగా అభిషేక ప్రియుడైనటువంటి బోలా శంకరున్ని గోవు పాలతో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు పఠిస్తూ, స్వామివారికి అభిషేకం,అర్చనలు చేస్తూ, స్వామిని దర్శించుకోవడం జరిగిందన్నారు. భక్తులు తమ గ్రహ దోషాలను తొలగించుకునేందుకు సోమవారం, శుక్రవారం విధిగా శివాలయాన్ని దర్శించుకుని అభిషేకం చేస్తున్నట్లయితే సర్వ దోషాలు దూరమైతాయన్నారు. ఈ క్షీరాభిషేకంలో గురు స్వాములు ముద్దెర శ్రీనివాస్, మల్లెత్తుల సదయ్య,ముష్క రంజిత్, స్వాములు చిన్నాల శ్రీకాంత్, గెల్లు రాకేష్,మద్రి రణధీర్, కొమ్ము అఖిల్,గెల్లు రాజు, శనిగరం రమేష్, తాళ్ల పెల్లి అనిల్,తాళ్ల పెల్లి నాగరాజు, తాళ్ల పెల్లి అఖిల్,దాడ సాత్విక్, ఆవుల అజయ్, నాగ సాయి,మల్లెత్తుల సాత్విక్,ముష్క హర్షవర్ధన్ తదితర స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# నిశాంక హాఫ్ సెంచరీ.. కేకేఆర్ ముందు స్వల్ప లక్ష్యం

ఇంటర్నెట్ డెస్క్:

ఐపీఎల్ 2026లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. కేకేఆర్ బౌలర్ల ధాటికి విలవిల్లాడారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేశారు. కేకేఆర్‌కు 143 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించారు. ఢిల్లీ ఓపెనర్ పాతుమ్ నిశాంక(50; 29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేశాడు. అతడి వల్లే ఢిల్లీకి ఆ గౌరవప్రదమైన స్కోర్ లభించింది. నిశాంక మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. ఆఖర్లో అశుతోశ్ శర్మ(39; 28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడాడు. కేఎల్ రాహుల్(23), నితీశ్ రాణా(8), సమీర్ రిజ్వీ(3), స్టబ్స్(2), అక్షర్ పటేల్(11), స్టార్క్(0) వెనువెంటనే ఔటై పెవిలియన్ చేరారు. విప్రజ్ నిగమ్(3లి), లుంగి ఎంగిడి(1లి) నాటౌట్‌గా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో అనుకుల్ రాయ్ 2, కార్తిక్ త్యాగి 2, వైభవ్ అరోరా 1, సునీల్ నరైన్ 1, గ్రీన్ 1 వికెట్ పడగొట్టారు.




# ధోని వికెట్ తీస్తేనే సీఎస్కేలో అవకాశం వస్తుందని భావించా: అశ్విన్

ఇంటర్నెట్ డెస్క్:

టీమిండియా స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున చాలా కాలంపాటు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. అశ్విన్ తన కెరీర్‌లో జరిగిన ఓ ఆసక్తికర సంఘటనను తాజాగా పంచుకున్నాడు. కెరీర్ ఆరంభంలో స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోని వికెట్ తీసిన ఆనందంలో అతిగా సెలబ్రేట్ చేసుకున్నాడని, దీంతో ధోని తనపై అసహనం వ్యక్తం చేశాడని వెల్లడించాడు. జియో స్టార్ నిర్వహించిన 'ది రవిచంద్రన్ అశ్విన్ ఎక్స్‌పీరియన్స్' అనే కార్యక్రమంలో అశ్విన్ మాట్లాడాడు.'నా కెరీర్ ఆరంభంలో జట్టులో ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజ స్పిన్నర్లు ఉండటంతో నాకు పెద్దగా అవకాశాలు రాలేదు. 2008లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. 2009 ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌పై తొలి మ్యాచ్ ఆడాను. కానీ 2010 వరకు నాకు అవకాశాలు పరిమితంగానే వచ్చాయి. అయితే ఛాలెంజర్ ట్రోఫీలో భాగంగా ఎంఎస్ ధోనికి బౌలింగ్ చేసే అవకాశం వచ్చింది. నా బౌలింగ్‌లో ధోని డీప్ కవర్ షాట్ ఆడగా నేను డైవ్ చేస్తూ క్యాచ్ పట్టాను. ఆ వికెట్ తీసిన ఆనందంలో అతిగా సెలబ్రేట్ చేసుకున్నా. దీంతో ధోని చిరాకు పడ్డాడు. 'ఇంతగా సెలబ్రేట్ చేసేదేముంది?' అంటూ ప్రశ్నించాడు. 'మీ వికెట్ తీసుకోవడం నా కల.. ఇదే నాకు సీఎస్కేలో అవకాశం తెచ్చిపెడుతుందని నా నమ్మకం' అని చెప్పా. ఆ తర్వాతి ఏడాదే నాకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో అవకాశం వచ్చింది' అని అశ్విన్ వెల్లడించాడు.




### అదే నా కోరిక..

'సీఎస్కేలో మంచి బ్యాటర్లు మాత్రమే కాదు.. నాణ్యమైన బౌలర్లు కూడా ఉండేవారు. మురళీ విజయ్, బద్రీనాథ్, షాదాబ్ వంటి దేశీయ ప్లేయర్లు కీలక పాత్ర పోషించేవారు. ప్లేయర్లకు పూర్తి స్వేచ్ఛ, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. టికెట్లు, ప్రయాణం, హోటల్ గదులు.. అన్నీ ఫ్రాంచైజీనే చూసుకునేది. ఆటగాళ్లు కేవలం క్రికెట్‌పైనే దృష్టి పెట్టేలా వాతావరణం ఉండేది. నా ఐపీఎల్ ప్రయాణం సీఎస్కేతోనే ముగియడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపించింది. ఎక్కడ మొదలైందో అక్కడే ముగిసింది. చెపాక్‌లో చివరి మ్యాచ్ ఆడాలనేది నా కోరిక. అది కూడా నెరవేరి ఉంటే మరింత ఆనందంగా ఉండేది' అని అశ్విన్ వివరించాడు.

# ఆ నిబంధనను సవరించి పేసర్లకు వెసులుబాటు కల్పించాలి: సునీల్ గావస్కర్

ఇంటర్నెట్ డెస్క్:

టీ20 క్రికెట్ ఫార్మాట్ ఇటీవల కాలంలో పూర్తిగా మారిపోయింది. 20 ఓవర్లలోనే బ్యాటర్లు 250కి పైగా పరుగులు చేయగలుగుతున్నారు. బౌలర్లు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా బ్యాటర్లను ఆపడం కష్టతరమవుతుంది. ఇదే విషయంపై టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందించాడు. టీ20 క్రికెట్ వచ్చాక ఆట పూర్తిగా బ్యాటర్ల వైపు మళ్లిందని ఆందోళన వ్యక్తం చేశాడు. బౌండరీలు చిన్నవిగా ఉండటం, ఫీల్డింగ్ పరిమితులు పెరగడం, పవర్‌ఫుల్ బ్యాట్లు రావడం వల్ల బౌలర్ల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో క్రికెట్ నిబంధనల్లో కీలక మార్పులు అవసరమని సూచించాడు. టీమిండియా దిగ్గజం, ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ సౌరవ్ గంగూలీకి ఈ విషయంపై కీలక విజ్ఞప్తి చేశాడు.'బ్యాటర్‌కు ఇలాంటి షాట్ ఆడొద్దని చెప్పలేం కదా! బౌలర్లకు మాత్రం ఎందుకు అన్ని ఆంక్షలు? తదుపరి ఐసీసీ సమావేశంలో బౌలర్ల పరిస్థితిపై కూడా ఆలోచించండి. బౌన్సర్ వైడ్ నిబంధనను సవరించి పేసర్లకు కొంత వెసులుబాటు కల్పించాలి. బౌలర్ వేసిన బౌన్సర్ బ్యాటర్ తలకు కొద్దిగా ఎత్తుకు వెళ్లినా అది 'వైడ్'గా ప్రకటిస్తున్నారు. ఇది పేసర్‌ను ఒక చేతిని కట్టేసి బౌలింగ్ చేయమన్నట్లే ఉంటుంది. బౌలర్లకు కూడా కొంత స్వేచ్ఛ ఇవ్వాలి. బ్యాటర్ సాధారణ స్టాన్స్ కంటే ఒక అడుగు ఎత్తులో వెళ్లే బంతిని వైడ్‌గా పరిగణించకుండా ఉంటే పేసర్లకు కాస్త ఉపశమనం లభిస్తుంది' అని గంగూలీని గావస్కర్ కోరాడు.




# టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్!

స్పోర్ట్స్ డెస్క్:

టీమిండియా టీ20 కెప్టెన్సీలో మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు సూర్యకుమార్ యాదవ్ నుంచి శ్రేయస్ అయ్యర్‌కు బదిలీకానున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2026 తర్వాత అయ్యర్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడని టాక్ వినిపిస్తోంది. ఈ మేరకు బీసీసీఐ శ్రేయస్ అయ్యర్‌కు మెసేజ్ కూడా పంపినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ నేతృత్వంలో టీమిండియా టీ20 వరల్డ్ కప్ 2026ను గెలిచినప్పటికీ, ఇటీవల పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న అతడిని సారథిగా తప్పించాలని సెలక్షన్ కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. 'స్కై' ఫామ్‌లోకి వస్తాడని కొంతకాలంగా వేచిచూస్తున్నప్పటికీ అతడి ఆటతీరులో మార్పు రాకపోవడంపై ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శ్రేయస్ అయ్యర్ రాణిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 9 ఇన్నింగ్స్‌లో 333 పరుగులు సాధించి 47.57 సగటు, 164.04 స్ట్రైక్ రేట్ నమోదు చేశాడు. దీంతో అయ్యర్‌ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడే శ్రేయస్ కెప్టెన్సీపై ప్రకటన వచ్చే ఛాన్స్ ఉందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా వన్డేలు, టీ20లు రెండింటికీ ఒకే కెప్టెన్ ఉండాలని బోర్డు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. శ్రేయస్‌కు గతంలో భారత టెస్ట్, వన్‌డే జట్లకు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది. మ్యాచ్ సమయంలో అతడు సహనంగా, ప్రశాంతంగా ఉండే విధానం, పరిణితితో కూడిన నిర్ణయాలు భారత టీ20 జట్టుకు కావాల్సిన లక్షణాలుగా పరిగణించబడుతున్నాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు




# ధరల పెంపుపై ప్రకటన.. బ్రిటానియా కంపెనీ షేర్ల పతనం




ఇంటర్నెట్ డెస్క్:

ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ తన ఉత్పత్తుల ధరలు పెంచేందుకు నిర్ణయించింది. ఈ విషయాన్ని తాజాగా తన మదుపర్లకు తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ధరల పెంపు ఉంటుందని పేర్కొంది. ఈ క్రమంలో కంపెనీ షేర్లు 5 శాతం మేర పతనమయ్యాయి. ప్రస్తుతం 4.99 శాతం నష్టంతో రూ.5,524 వద్ద ట్రేడవుతోంది.ఇక 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో తమ నికర లాభాం 21.2 శాతం మేర పెరిగి రూ.678 కోట్లకు చేరినట్టు కూడా కంపెనీ నిన్న ప్రకటించింది. యూఎస్-ఇరాన్ యుద్ధ ప్రభావం ఈ ఆర్థిక సంవత్సరంలో తమపై ఉండదని కూడా బ్రిటానియా వెల్లడించింది. ఇక ఈక్విటీ షేర్లపై కంపెనీ రూ.90.50 డివిడెండ్‌ను ప్రకటించింది. మొత్తం రూ.407.88 కోట్లను షేర్ హోల్డర్‌లకు పంపిణీ చేసినట్టు కూడా పేర్కొంది. మరో ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం డాబర్ ఇండియా కూడా తమ ఉత్పత్తుల ధరలు పెంచే విషయమై ఆలోచిస్తున్నట్టు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. 4 శాతం మేర ధరల పెంపుపై యోచిస్తున్నట్టు సమాచారం. ముడి సరకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో డాబర్ ఇండియా ధరల పెంపుపై యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఏఐతో 'సాంప్రదాయ ఐటీ'కి భంగం

-అయినా ఐటీ పరిశ్రమ పదిలం

-కోఫోర్జ్ సీఈఓ సుధీర్ సింగ్

న్యూఢిల్లీ:



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత విస్తృత వినియోగంతో సాంప్రదాయ ఐటీ సేవల విధానానికి అంతరాయం కలిగినప్పటికీ, ఇది ఐటీ ఇండస్ట్రీని కుదించదని నోయిడాకు చెందిన ఐటీ కంపెనీ కోఫోర్జ్ సీఈఓ సుధీర్ సింగ్ అన్నారు. అంతేకాదు, ఐటీ కంపెనీలకు ఏఐ టెక్నాలజీ అధిక మార్జిన్‌తో కూడిన కాంట్రాక్టులను అందిస్తోందన్నారు. ఏఐతో కోడింగ్ చవకే అయినప్పటికీ, దాని నిర్వహణ, భద్రతతో పాటు సొంతం చేసుకోవడం ఖరీదైన విషయమని అన్నారు. "20 ఏళ్ల క్రితం క్లౌడ్ మైగ్రేషన్ లాగే, ఏజెంట్ ఏఐ భారీ స్థాయి సేవలను అందించగలిగినప్పటికీ, వాటి ఉత్పత్తిని ఎవరైనా పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏజెంట్లకు పునఃశిక్షణ అందించాలి. పాలన ప్రమాణాలకు భంగం కలుగకుండా జాగ్రత్తపడాల్సి ఉంటుంద"ని సింగ్ పేర్కొన్నారు. టెక్నాలజీ సేవలపై ఏఐ ప్రభావానికి సంబంధించి ఇన్వెస్టర్లలో ఆందోళనలు నెలకొన్నాయి. అయితే, ఐటీ ఇండస్ట్రీకి ఏఐ కొత్త సేవల విభాగాలను శరవేగంగా సృష్టిస్తోంది. 16,000 -18,000 కోట్ల డాలర్ల మేర మార్కెట్ అవకాశాలను కల్పిస్తోంది. వచ్చే ఐదేళ్లలో ఈ మార్కెట్ విలువ 35 శాతం చొప్పున వృద్ధి చెంది 80,000 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోగలదని త్రైమాసిక ఫలితాల సందర్భంగా విడుదల చేసిన ఇన్వెస్టర్ ప్రెజెంటేషన్‌లో కోఫోర్జ్ అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏఐ టెక్నాలజీలో 55 లక్షల డాలర్ల పెట్టుబడులు పెట్టిందీ సంస్థ. అంతేకాదు, తమ ఆదాయ వృద్ధి, మార్జిన్ల పెరుగుదలతో ఏఐ గణనీయ పాత్ర పోషిస్తోందని కంపెనీ పేర్కొంది. 2025-26లో కోఫోర్జ్ నికర లాభం దాదాపు రెండింతలై రూ.1,555.7 కోట్లకు చేరుకుంది. ఆదాయం 35.8 శాతం వృద్ధితో 16,402.7 కోట్లకు పెరిగింది.

# విస్తరణ బాటలో స్కోడా ఆటో ఇండియా

హైదరాబాద్




ఈ ఏడాది (2026) దేశవ్యాప్తంగా కొత్తగా 35 డీలర్‌షిప్స్ (కస్టమర్ టచ్ పాయింట్స్) కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలోని 182 నగరాల్లో మొత్తం 330 టచ్ పాయింట్స్‌ను కంపెనీ నిర్వహిస్తోందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే టచ్ పాయింట్స్‌లో నాలుగింటిని తెలంగాణ, ఏపీల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్‌ల్లో మొత్తం 19 టచ్‌పాయింట్స్‌ను నిర్వహిస్తోంది. ఏపీ, తెలంగాణ మార్కెట్లో కంపెనీ మార్కెట్ వాటా 12 శాతంగా ఉందన్నారు. 2025లో మొత్తం 73,000 పైగా కార్లను విక్రయించగా ఈ ఏడాది విక్రయాల్లో 8-10 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. కాగా భారత మార్కెట్లోకి ఎలక్ట్రిక్ కారును తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గుప్తా తెలిపారు.

# రణవీర్ సింగ్ 'ధురంధర్ 2' ఓటీటీ రిలీజ్ తేదీ ఖరారు

-ధురంధర్-2 ఓటీటీలోకి వస్తోంది.. అయితే భారత్ లో కాదు!
-మే 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అంతర్జాతీయ స్ట్రీమింగ్
-భారత్‌లో జియోహాట్‌స్టార్‌లో విడుదల కావొచ్చని ప్రచారం
-ప్రపంచవ్యాప్తంగా రూ.1,790 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన చిత్రం
-దాదాపు 4 గంటల నిడివితో 'రా అండ్ అన్ దేఖా' వర్షన్‌గా విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మే 14 నుంచి అంతర్జాతీయంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, భారత్‌లో మాత్రం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉండదు. దీంతో భారత ప్రేక్షకులు ఎక్కడ చూడాలనే దానిపై ఆసక్తి నెలకొంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమా 'రా అండ్ అన్ దేఖా' అనే ట్యాగ్‌లైన్‌తో, దాదాపు 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో రానుంది. సెన్సార్ చేయని సన్నివేశాలు, అదనపు ఫుటేజ్‌తో ఈ ప్రత్యేక వర్షన్‌ను విడుదల చేయనున్నారు. భారత్‌లో ఈ చిత్రాన్ని జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌పై మే 14నే విడుదల చేయవచ్చని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే, దీనిపై నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమాలోని ఒక పాట రీమిక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో, థియేట్రికల్ రిలీజ్ తర్వాత 8 వారాల గ్యాప్ ఇచ్చాకే ఓటీటీలోకి వస్తుందని నిర్మాతలు గతంలో తెలిపారు. మే 14 నాటికి సినిమా విడుదలై సరిగ్గా 8 వారాలు పూర్తవుతుంది. ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సారా అర్జున్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటివరకు ఈ సినిమా భారత్‌లో రూ. 1,140 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,791 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అంతర్జాతీయంగా విడుదల తేదీ ఖరారైనప్పటికీ, భారత్‌లోని ఓటీటీ రిలీజ్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# దక్షిణాది స్టార్లతో పనిచేయడం తన తండ్రికి గర్వకారణమని వెల్లడి





-హిందీలో అవకాశాలు లేనివారే సౌత్ వైపు వెళతారనే అభిప్రాయం అప్పట్లో ఉండేది: సమీరారెడ్డి
-తనను దక్షిణాది సినిమాల్లోకి వెళ్లొద్దని హెచ్చరించారన్న సమీరారెడ్డి
-ఇప్పుడు బాలీవుడ్ అగ్రతారలు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్నారని వ్యాఖ్య

దక్షిణాది సినిమాలపై తనకున్న గౌరవాన్ని సినీ నటి సమీరారెడ్డి మరోసారి చాటుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో నాటి అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. సమీరారెడ్డి కెరీర్ మొదట్లో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు, ఆమె టీమ్ సభ్యులు దక్షిణాది సినిమాల వైపు వెళ్లొద్దని హెచ్చరించారట. "హిందీలో అవకాశాలు లేని వారే సౌత్ వైపు వెళతారు" అనే తప్పుడు అభిప్రాయం అప్పట్లో ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు.
కానీ, ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా తన మూలాలను గౌరవిస్తూ, ఆ మాటలను పక్కన పెట్టి జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ల సరసన నటించడానికి ఆమె సిద్ధపడ్డారు. చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్ వంటి దిగ్గజాలతో పనిచేయడం తన కుటుంబానికి, ముఖ్యంగా తన తండ్రికి గర్వకారణమని ఆమె సగర్వంగా చెప్పుకొచ్చారు.
ప్రస్తుతం బాలీవుడ్ అగ్ర హీరోయిన్లు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్న విషయాన్ని సమీరా గుర్తు చేశారు. దక్షిణాది దర్శకులు కొత్త ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఇక్కడి సినిమాలు సాంకేతికంగా, యాక్షన్ పరంగా ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆమె విశ్లేషించారు. హిందీ మేకర్స్ తరచుగా 'సేఫ్ జోన్'లో ఉండాలని చూస్తారని ఆమె అభిప్రాయపడ్డారు.
దాదాపు దశాబ్ద కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్న సమీరా, ఇప్పుడు సంజయ్ దత్ సరసన 'ఆఖరి సవాల్' చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఇది తన కమ్ బ్యాక్ కాదని, కేవలం ఒక చిన్న విరామం తర్వాత చేస్తున్న ప్రయాణమని ఆమె స్పష్టం చేశారు.

# ఎన్నారై మోసం కేసు..

## నటి అషురెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

-తనపై నమోదైన కేసులో దర్యాప్తు నిలిపివేయాలని కోరిన అషురెడ్డి
-దర్యాప్తు నిలిపివేతకు, కఠిన చర్యల నుంచి మినహాయింపునకు నిరాకరణ
-పెళ్లి పేరుతో రూ.10.5 కోట్లు వసూలు చేశారంటూ ఆరోపణలు
-కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ జూన్ 9కి వాయిదా



పెళ్లి పేరుతో ఎన్నారై వ్యాపారవేత్తను మోసం చేశారన్న ఆరోపణలపై నమోదైన క్రిమినల్ కేసులో సినీ నటి అషురెడ్డికి (వెంకట అశ్వినిరెడ్డి) తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపైనా, తన తల్లి యశోదరెడ్డిపైనా నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, దర్యాప్తును నిలిపివేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కఠిన చర్యలు తీసుకోకుండా మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ కేసుపై గురువారం జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పోలీసులు తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని, దర్యాప్తును నిలిపివేయాలని అషురెడ్డి తరఫు న్యాయవాది కోరారు. అయితే, ప్రభుత్వ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కేసు నమోదుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. సుమారు రూ.10.5 కోట్ల నగదు బదిలీ ఆన్‌లైన్‌లోనే జరిగిందని, దర్యాప్తు కొనసాగించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే పిటిషనర్‌కు 41ఏ నోటీసులు జారీ చేశామని కూడా పేర్కొన్నారు. లండన్‌లో ఉంటున్న తన కుమారుడు వై.వి.ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషురెడ్డి, ఆమె తల్లి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసం చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వై. సత్యనారాయణమూర్తి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేశారు.

## తన మరణంపై వస్తున్న వదంతులను ఖండించిన శక్తి కపూర్

-నేను చనిపోలేదు.. ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నా: శక్తి కపూర్
-ఆరోగ్యంగా ఉన్నానంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల
-తప్పుడు ప్రచారం చేసేవారిపై సైబర్ ఫిర్యాదు చేస్తానని హెచ్చరిక
-గతంలో తన తండ్రి సినీ ప్రస్థానం గురించి వివరించిన శ్రద్ధా కపూర్
-ఎలాంటి నేపథ్యం లేకుండా తండ్రి పరిశ్రమలో నిలదొక్కుకున్నారని ప్రశంస



ప్రముఖ బాలీవుడ్ నటుడు శక్తి కపూర్ (73) తన మరణంపై సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వదంతులను తీవ్రంగా ఖండించారు. తాను ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఇన్?స్టాగ్రామ్?లో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ తప్పుడు ప్రచారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.
"అందరికీ నమస్కారం. నా మరణం గురించి వస్తున్న వార్తలన్నీ అబద్ధం. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాను. దయచేసి ఆ వార్తలను పట్టించుకోవద్దు" అని శక్తి కపూర్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నానని, ఇలాంటివి చేయడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఈ వీడియో చూసిన ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెట్టారు.కాగా, నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో శక్తి కపూర్ ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా సుమారు 700 చిత్రాలలో నటించి తనదైన ముద్ర వేశారు. 'రాజా బాబు', 'అందాజ్ అప్నా అప్నా', 'హంగామా', 'మాలామాల్ వీక్లీ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆయన ఖాతాలో ఉన్నాయి

# 'గోదారి గట్టుపైన' - మూవీ రివ్యూ!

సుమంత్ ప్రభాస్ హీరోగా చేసిన సినిమానే 'గోదారి గట్టుపైన'. గతంలో 'మేం ఫేమస్' అంటూ వచ్చిన సుమంత్ ప్రభాస్, హీరోగా మంచి మార్కులు కొట్టేశాడు. ఆ తరువాత కొంత గ్యాప్ తీసుకుని ఆయన చేసిన సినిమానే ఇది. తెలంగాణ నేపథ్యంతో కూడిన కథతో మొదటి సినిమా చేసిన తను, అందుకు పూర్తి భిన్నంగా గోదావరి యాస నేపథ్యంలో ఈ సినిమాను చేశాడు. ఈ సినిమాతో కోలీవుడ్ బ్యూటీ 'నిధి ప్రదీప్' తెలుగు తెరకి పరిచయమైంది. ఈ రోజునే థియేటర్లకు వచ్చిన ఈ సినిమా ఎలా ఉందనేది చూద్దాం.
అది 'తణుకు' సమీపంలోని 'మంచిలి' అనే విలేజ్. అక్కడ రాజు ( సుమంత్ ప్రభాస్) ఆటో నడుపుతూ తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. తల్లి .. తండ్రి .. చెల్లెలు సమైక్య .. ఇదీ అతని కుటుంబం. ఇక తన స్నేహితులైన రహీమ్ (సుదర్శన్) .. రాబర్ట్( రాజ్ కుమార్ కసిరెడ్డి)తో తన ఎమోషన్స్ ను ఎక్కువగా షేర్ చేసుకుంటూ ఉంటాడు. రాజు చెల్లెలు 'సమైక్య' స్నేహితురాలే మాయ ( నిధి ప్రదీప్). ఆమె ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న శ్యామ్ బాబు (జగపతిబాబు) కూతురు.
శ్యామ్ బాబుకి తన కూతురు 'మాయ' అంటే ప్రాణం. డబ్బుకి ఇబ్బంది లేని కుటుంబానికి తన కూతురును కోడలిగా పంపించాలనేది ఆయన ఆలోచన. అయితే సమైక్య ద్వారా మాయకి రాజుతో పరిచయవుతుంది. తాను ఇంజనీరింగ్ చదువుతున్నప్పటికీ, పెద్దగా చదువు అబ్బని రాజు పట్ల అభిమానం పెంచుకుంటుంది. అది కాస్త ప్రేమగా మారుతుంది. అప్పటి నుంచి మాయ ధోరణిలో మార్పు రావడాన్ని శ్యామ్ బాబు గమనిస్తాడు. అందుకు కారణం ఏమిటనేది ఒక కంట గమనిస్తూ ఉండమని, తన భార్య ఝాన్సీ ( లైలా)ను హెచ్చరిస్తాడు.
ఒక రోజున శ్యామ్ బాబు తన కూతురుకి ఒక సంబంధం తీసుకొస్తాడు. తన కూతురు భవిష్యత్తు అన్ని విధాలుగా బాగుంటుందని అతను నమ్మిన సంబంధం అది. తాను ఆటో డ్రైవర్ రాజును లవ్ చేస్తున్నట్టుగా అప్పుడే తండ్రితో చెబుతుంది మాయ. అప్పుడు శ్యామ్ బాబు ఏం చేస్తాడు? ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? రాజు - మాయ పెళ్లి జరుగుతుందా? తన కూతురుకు గొప్ప సంబంధం చేయాలనే శ్యామ్ బాబు కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ.
ఒక మధ్య తరగతి తండ్రికి తన కూతురు విషయంలో అనేక భయాలు ఉంటాయి. ఆమె పెళ్లికి దగ్గర పడుతున్నా కొద్దీ అతనిలో భయంతో పాటు బాధ్యత కూడా పెరుగుతూ పోతుంది. తన కూతురికి ఎలాంటి ఇబ్బందులు లేని సంబంధం చేయాలని ఆ తండ్రి కోరుకుంటాడు. ఆ తండ్రి ఆశలకు పూర్తి విరుద్ధమైన వ్యక్తిని ప్రేమిస్తున్నట్టు ఆ కూతురు చెబితే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశంతో ఈ కథ వేగాన్ని పుంజుకుంటుంది.
హీరో - హీరోయిన్ పరిచయం .. సాన్నిహిత్యం .. ప్రేమ .. అలకలతో ఫస్టాఫ్ సాగుతూ వెళుతుంది. వాళ్ల మధ్య ప్రేమ బలపడుతూ ఉన్న సమయంలోనే, చదువుతో పాటు కులమతాలు అడ్డుగోడలుగా మారడం మొదలవుతుంది. ఈ అడ్డుగోడలను ఈ






ప్రేమ జంట ఎలా దాట గలిగిందనేది సెకండాఫ్ పై కుతూహలాన్ని పెంచుతుంది.సెకండాఫ్ అంతా ఈ ప్రేమ పక్షులు ఎదుర్కునే పరీక్షలతోనే కొనసాగుతుంది.
'గోదారి గట్టుపైన' .. ఇది ఒక రాజు గాడి ప్రేమకథ. లేదంటే ఒక ఆటోవాలా ప్రేమకథగా చెప్పుకోవచ్చు. చదువుకున్న అమ్మాయికీ .. చదువు అబ్బని ఆటోడ్రైవర్ కి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ప్రేమకి కులమతాలు లేవు .. ప్రేమికులకు అవి అడ్డుగోడలు కాదు. అభ్యంతరాలు ఉన్నవాళ్లు ఆ తరువాత అర్థం చేసుకుని సర్దుకుపోవలసిందే అని నిరూపించే కథ ఇది. ఆల్రెడీ ఇలాంటి కథలు గతంలో చాలానే వచ్చాయి గదా? అనే ప్రశ్న తప్పకుండా ఎదురవుతుంది. కాస్త అటు ఇటుగా అలాంటి ప్రయత్నమే మళ్లీ జరిగితే తప్పేం లేదు కదా! అనే సమాధానంతో సరిపెట్టుకోవలసిందే .
రొటీన్ గా సాగే ఈ ప్రేమకథలో జగపతి బాబు - లైలా పాత్రలు కాస్త బలంగానే కనిపిస్తాయి. కానీ ఆ పాత్రలను పవర్ఫుల్ గా ఆవిష్కరించలేకపోయారు. కథలో కీలకమైన మలుపు జగపతిబాబు దగ్గరికి వచ్చి ఆగేసరికి, మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఆ సమయంలో కూడా ఆ పాత్రను ఆయనకి గల క్రేజ్ కి తగినట్టుగా పరిగెత్తించలేదు. అసలు కూతురు లవ్ మేటర్ శ్యామ్ బాబుకి ఎప్పుడు తెలుస్తుందా అనే ఉత్కంఠతోనే ఆడియన్స్ వెయిట్ చేస్తూ కూర్చుంటారు. ఇంటర్వెల్ తరువాత చాలా సేపటికి గానీ, వాళ్ల కల ఫలించదు. కథ రొటీన్ గా ఉండటంతో, విషయం లేకపోయినా సుదర్శన్ కామెడీనే బెటర్ గా భావించి ప్రేక్షకుడు పరిగెడుతూ ఉంటాడు.
ఇక ప్రీ క్లైమాక్స్ లో సుమంత్ ప్రభాస్ .. జగపతి బాబు .. లైలా .. రాజీవ్ కనకాలకి రాసిన డైలాగ్స్ సింపుల్ గా అనిపిస్తూనే ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి. క్లైమాక్స్ అందరూ ఊహించినట్టుగానే ఉంటుంది. సుమంత్ ప్రభాస్ నటన బాగుంది. కాకపోతే గోదావరి యాసలో డైలాగ్స్ చెప్పడానికి బాగానే ఇబ్బంది పడినట్టుగా అనిపిస్తుంది. నిధి ప్రదీప్ నటన కూడా ఆకట్టుకుంటుంది. ఆమె కళ్లు ప్రధానమైన ఆకర్షణగా నిలుస్తాయి.
జగపతిబాబు యాక్టింగ్ చాలా సహజంగా అనిపిస్తుంది. కాకపోతే ఆ పాత్రకి ఇంకాస్త పవర్ అవసరమని అనిపిస్తుంది. సుదర్శన్ కామెడీ ఆరంభంలో కాస్త అతిగా అనిపించినా, ఆ తరువాత ఆడియన్స్ అలవాటు పడిపోతారు. విలేజ్ నేపథ్యంలో లొకేషన్స్ మనకి బోర్ అనిపించకుండా చూసుకుంటాయి. సాయి సంతోష్ ఫొటోగ్రఫీ .. నాగవంశీ కృష్ణ సంగీతం ఫరవాలేదు.
రొటీన్ గా నడిచే ప్రేమకథ ఇది. కాలవగట్లు .. కలువపూలు .. మిణుగురులు వంటి సన్నివేశాలు కూడా రొటీన్ గానే అనిపిస్తాయి. కామెడీ సన్నివేశాలు కూడా అదే దార్లో పరిగెత్తుతాయి. చివర్లో కొన్ని డైలాగ్స్ మాత్రం ఎమోషనల్ గా కనెక్ట్ అవుతాయి. అంతకు మించి 'గోదారి గట్టుపైన' మనకి కొత్తగా కనిపించేదేమీ లేదు.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com